# సారొస్తున్నారు..

- నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ రాక
- నాలుగు చోట్ల ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్న ప్రగతి ప్రదాత
- దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, గద్వాలలో బహిరంగ సభలు
- పార్టీశ్రేణుల విస్తృత ఏర్పాట్లు
- పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు ఆల, చిట్టెం, రాజేందర్‌రెడ్డి, బండ్ల
- పోటాపోటీగా జనసమీకరణ



దేవరకద్రలో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సోమవారం సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు. మూడు జిల్లాలు.. నాలుగు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేపట్టనున్నారు. దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, గద్వాల నియోజకవర్గాల్లోని ప్రజా ఆశీర్వాద సభలకు ప్రగతి ప్రదాత హాజరుకానున్నారు. ఆయా ప్రాంతాల్లో పార్టీశ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నిచోట్ల పెద్ద ఎత్తున జనాన్ని సమీకరించేందుకు ఇప్పటికే పార్టీ అభ్యర్థులు సమావేశాలు నిర్వహించి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా కేసీఆర్ బహిరంగ సభలు ఉండటంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఇటీవల పార్టీలో సీనియర్ నేతలంతా చేరడం. కేసీఆర్ కీలక సభలకు హాజరుకావడం రాజకీయ వేడిని రగిలిస్తోంది. ఇప్పటికే అన్ని పార్టీల కంటే ముందే బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అభ్యర్థులకు మద్దతుగా కేసీఆర్ అన్ని నియోజకవర్గాల్లో పర్యటించేందుకు తేదీలు కూడా ఖరారయ్యాయి. ఈ టూర్లను విజయవంతం చేసేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి నాలుగు చోట్ల ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొంటుండడంతో జిల్లా పోలీసు యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఇప్పటికే హెలిప్యాడ్ల నిర్మాణం పూర్తవగా.. సభా వేదిక, గ్యాలరీలను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. సభలకు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా జనం తరలివస్తుండడంతో బీఆర్‌ఎస్‌లో ఉత్సాహం నెలకొన్నది. దేవరకద్రలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మక్తల్‌లో చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నారాయణపేటలో రాజేందర్‌రెడ్డి, గద్వాలలో బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

**ఒకే రోజు నాలుగు చోట్ల..**

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు మద్దతుగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఒకేరోజు ఉమ్మడి జిల్లాలోని నాలుగు సభల్లో పాల్గొనున్నారు. దేవరకద్ర, గద్వాల, నారాయణపేట, మక్తల్ జరిగే ప్రజాఆశీర్వాద సభల్లో పాల్గొనున్నారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని కురుమూర్తికి వెళ్లే రహదారిలో బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సభావేదికను ఏర్పాటు చేశారు. అనంతరం గద్వాల ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననుండగా, అయిజ రహదారిలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. గద్వాల నుంచి మక్తల్ చేరుకుంటారు. మక్తల్ పట్టణంలోని ఎల్లమ్మకుంట కాటన్ మిల్ వెనకాల సభావేదికను సిద్ధం చేశారు. ఇక్కడి నుంచి నేరుగా నారాయణపేటకు వెళ్తారు. నారాయణపేట పట్టణంలోని స్టేడియం మైదానంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహిస్తారు. అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

**గులాబీమయమైన నియోజకవర్గాలు..**

ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనడానికి వస్తున్న పార్టీ అధినేతకు స్వాగతం పలకడానికి పెద్దఎత్తున ఫ్లెక్సీలు, గులాబీ జెండాలు ఏర్పాటు చేస్తున్నారు. సభకు వచ్చే రహదారుల వెంట నాయకుల స్వాగత తోరణాలు, జెండాలతో దేవరకద్ర, జోగుళాంబ గద్వాల, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాలు గులాబీమయంగా మారాయి. రహదారుల చుట్టుపక్కల మొత్తం పార్టీ జెండాలను కట్టి అధినేతకు స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేశారు. సభావేదిక చుట్టుపక్కల పార్టీ అభ్యర్థులు భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో సభాప్రాంగణం మొత్తం గులాబీమయమైంది.

**కేసీఆర్ ప్రసంగంపై సర్వత్రా ఉత్కంఠ..**

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే రాజకీయ పార్టీలు తమ అస్త్రాలను సిద్ధం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గులాబీ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లా సభల్లో ఏం మాట్లాడబోతున్నారనే ఉత్కంఠ నెలకొంది. నడిగడ్డలో సీఎం చేసే ప్రసంగంపై అందరి దృష్టి పడింది. ఇక్కడే బీజేపీ నేతలపై విరుచుకుపడే అవకాశం ఉందని భావిస్తున్నారు. అలాగే నారాయణపేటలో గత ఎన్నికల్లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం అధికారం వచ్చిన వెంటనే పేటను జిల్లా చేస్తామని చెప్పి ఆ కలను నెరవేర్చారు. మెడికల్ కాలేజీ కూడా మంజూరు చేసి జిల్లా ప్రజలకు కానుకగా ఇచ్చారు. జిల్లా ఏర్పడ్డాక కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి రావడంతో జిల్లా రూపురేఖలే మారిపోవడం గమనార్హం. మళ్లీ గెలిపిస్తే జిల్లాను మరింత సస్యశ్యామలం చేసే అవకాశం లేకపోలేదు. అలాగే దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలకు మించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మొత్తంపైన పార్టీ అధినేత వస్తుండడంతో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకొనుంది. బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.

## దేవరకద్ర గులాబీమయం

- సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర, నవంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో సోమవారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే ప్రజాఆశీర్వద సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. అదివారం ఎమ్మెల్యే నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో నిర్వహించే ప్రజా ఆశీర్వద సభా ప్రాంగణాన్ని, సభాస్థలికి కొంత దూరంలోనే ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. జనం భారీగా హాజరయ్యే అవకాశం ఉన్నందునా ఏర్పాట్లు, భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట అడ్డాకుల జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయావెంకటేశ్, పార్టీ మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, ముడా డైరెక్టర్ కర్ణంరాజు, నాయకులు శ్రీకాంత్ యాదవ్, బాలరాజు, సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు సత్యంసాగర్, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

## సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్ టౌన్, నవంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మక్తల్‌లో నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాదసభకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సభా ప్రాంగణంలో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాట్ల పనులను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 12గంటలకు సభకు సీఎం కేసీఆర్ హాజవుతారని, నియోజకవర్గం నలువైపుల నుంచి ప్రజలు తరలిరానున్నారన్నారు. నారాయణపేట క్రాస్‌రోడ్ నుంచి కాటన్‌మిల్ వెనుక భాగాన మక్తల్, మాగనూర్, కృష్ణ, నర్వ, ఆత్మకూర్, అమరచింత, ఊట్కూర్ నుంచి వచ్చే వాహనాలను నిలిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పార్కింగ్ స్థలం నుంచి సభావేదిక 300మీటర్ల దూరంలో ఉంటుందన్నారు. వీఐపీల వాహనాల కోసం సభావేదిక సమీపంలోని ముందు భాగంలోని కృష్ణసాయినగర్ కాలనీలో పార్కింగ్, అలాగే కళాకారుల ఆటపాట కోసం ప్రత్యేక స్టేజీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభకు నియోజకవర్గం నుంచి లక్ష మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

## హ్యాట్రిక్ విజయం ఖాయం

- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



సభావేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి


నారాయణపేట, నవంబర్ 5 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోపాటు నియోజకవర్గంలో రూ.2,565కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజల ఆశీర్వాదంతో హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నారాయణపేటలోని క్రీడా మైదానంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఆదివారం ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ముఖ్యమంత్రి సభకు లక్ష మంది హాజరు కానున్నారన్నారు. సభలో నారాయణపేటకు రింగ్‌రోడ్, దామరగిద్ద మండలం కాన్‌కుర్తిలో రిజర్వాయర్, కొత్తగా మూడు మండలాల ఏర్పాటు కావాలని కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవరి మల్లప్ప, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్యా, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజొద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, శ్రీపాద కులకర్ణి, విజయ సాగర్, సుభాష్, నాగేందర్ పాల్గొన్నారు.

## కుట్రదారులను నమ్మొద్దు

- అభివృద్ధిని కాంక్షించే వారిని ప్రజలు గుర్తించాలి
- 60ఏండ్లు అధికారమిస్తే చేసింది శూన్యం
- కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మహబూబ్‌నగర్‌లో విస్తృతంగా ప్రచారం



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంతో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న హన్వాడ మండల నాయకులు



గజమాలతో మంత్రికి స్వాగతం పలుకుతున్న జాంద్ర కులస్తులు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబర్ 5 : 60ఏండ్లు అధికామిస్తే పాలమూరును కరువు జిల్లాగా మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, వారిని నమ్మితే మళ్లీ గోసపడడం ఖాయమని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 2వ వార్డు ఏనుగండలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. మహబూబ్‌నగర్ పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థికి ఎన్నికల తర్వాత ఫోన్ చేస్తే.. మీరు డయల్ చేసిన వ్యక్తి అందుబాటులో లేరనే సమాధానమే వస్తుందని, ఇలాంటి వారిని నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ అభివృద్ధిని కాంక్షించే బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. రోడ్డు విస్తరణ వల్ల ఏనుగొండకు ఎంతో ప్రయోజనం కలిగిందని, అభివృద్ధికి అవకాశం ఏర్పడిందన్నారు. అప్పన్నపల్లి ఆర్వోబీ పదేండ్లుగా పెండింగ్‌లో ఉండగా, తాను ఎమ్మెల్వే అయిన వెంటనే వేగవంతంగా పూర్తి చేయించానన్నారు. రెండో ఆర్వోబీని కేవలం ఏడాది వ్యవధిలో అద్భుతంగా నిర్మించడంతోపాటు సెంట్రల్ లైటింగ్ పనులు కూడా పూర్తి చేసామన్నారు. అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్ పార్టీకి ఓటెయ్యాలన్నారు. అనంతరం మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు దూరంగా ఉన్న వ్యక్తిని దూరం పెట్టాలని, పని చేసే మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు అండగా ఉండి మరోసారి గెలిపించుకోవాలని కోరారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఏనుగొండలో రూ.5వేలకు ఎకరా లభించేదని, నేడు అదే భూమి రూ.5కోట్లకు చేరుకున్నదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్ కోరమోని వెంకటయ్య, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్నయాదవ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, కౌన్సిలర్ కోరమోని వనజా, నాయకుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యోగులకు అండగా ఉంటా..**

రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటానని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని న్యూగంజ్‌లో వైస్ చైర్మన్ తాటి గణేశ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తచెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రిటైర్డ్ స్పోర్ట్స్ ఆఫీసర్ రమేశ్‌కుమార్, రిటైర్డ్ ఎంపీడీవో కుమారస్వామి, రిటైర్డ్ డీఎంహెచ్‌వో మాణిక్యరావు, ఉద్యోగులు కృష్ణయ్య, నర్సింహ, తులసీరాంతోపాటు టీడీగుట్ట, కొత్తగంజ్, మోతినగర్, బోయపల్లిగేట్, కిద్వాయిపేటకు చెందిన పలువురు రిటైర్డ్ ఉద్యోగులు బీఆర్‌ఎస్ నాయకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే మహబూబ్‌నగర్ కొత్తగంజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హన్వాడ మండలం పెద్దదర్పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్యముదిరాజ్, జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్ మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం పట్టణంలోని బండ్లగేరిలో నివాసముండే సబిల్‌ట్రస్ట్ అధ్యక్షుడు మౌలానా నయీమ్ కౌసర్ రషాదీ అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతుండగా, ఆయన నివాసానికి చేరుకున్న విషయం తెలుసుకున్న మంత్రి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

**జాంద్ర సంఘం ఆత్మీయ సమ్మేళనం..**

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 5 : మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జాంద్ర సంఘం ఆధ్వర్యంలో బండ్లగేరిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం, రోడ్ షోలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి హాజరయ్యారు. క్రేన్ సాయంతో భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. కురిహినిశెట్టి కాలనీలోని మైసమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలిపామని, ఆలయ మండపానికి రూ.5లక్షలు, పద్మావతి కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనానికి రూ.కోటీ, జాంద్ర కులస్తులకు 180 డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. కార్యక్రమంలో గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్నయాదవ్, మున్సిపల్ కో ఆప్షన్ రామలింగం, పద్మజా, మహేందర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.